# శ్రీ ఆండాళ్ వైభవము

కల్లూరి చంద్రమౌళి



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# శ్రీ ఆండాళ్ వైభవము


రచయిత

**కల్లూరి చంద్రమౌళి**



ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2009

# SRI ANDAL VAIBHAVAMU

*By*
**Kalluri Chandramouli**

© All Rights Reserved

T.T.D.Religious Publications Series No. *3*

First Edition : 1980

Re-print : 2009

Copies : 2000

*Published by*
K.V.Ramanachary I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati.

# ప్రకాశిక

దక్షిణదేశంలో శ్రీవిల్లిపుత్తూరు అనే శ్రీవైష్ణవ దివ్య దేశంలో కల్పసూత్ర వ్యాఖ్యాత, అనుష్ఠానపరుడు, నానాశాస్త్రకోవిదుడు, వటపత్రశాయి కోవెలలో పుష్పమాలా కైంకర్యపరుడూ అయిన శ్రీవిష్ణుచిత్తులవారికి అయోనిజయైన కుమార్తెగా తులసీవనంలో గోదాదేవి లభించింది. తులసి మొక్క వేరుతో సహా పరిమళించినట్లు ఈమె భగవద్భక్తితో వాసిస్తూ తండ్రివద్ద సకలవిజ్ఞానాన్ని సముపార్జించింది.

తనకు పెళ్లి అంటూ జరిగితే అది శ్రీరంగనాథుడితోనే అని నిశ్చయించుకొని స్వామి వాల్లభ్యం కోసం మునుపు గోపికలు ఆచరించిన కాత్యాయనీ వ్రతం లాంటి వ్రతం – "తిరుప్పావై" వ్రతం నెలరోజుల పాటు మార్గశిరమాసంలో అనుష్ఠించింది. మహాకవయిత్రి అయిన ఆండాళ్ తల్లి ద్రావిడ భాషలో ముప్పై పాటలు వ్రాసి పాడి వ్రతాచరణతో స్వామిని అలరించింది. పన్నెండు మంది ఆళ్వారులలో ఒకరైన ఆ మహాదేవి రచించిన దివ్యప్రబంధమే తిరుప్పావు. అందులో అనేక వేద వేదాంతార్థాలు ఇమిడి ఉన్నాయి. ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం పునర్ముద్రిస్తున్నది. ఈ రచనను పాఠకులు సమాదరించగలరని మా విశ్వాసం.

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు,తిరుపతి



శ్రీ గోదాదేవి పరమభక్తురాలు. శ్రీరంగరంగదాముని వివాహ మాడి వారిలో లీనమైన దివ్యబాల. ఆళ్వారులలో ధ్రువతార. ఈమె రచించిన తిరుప్పావై ముప్పదిపాశరములు గల్గియున్నది. ధనుర్మాస ములో దినమునకొక పాశరము చొప్పున ప్రార్థనా పూర్వకముగా పఠించు సత్సంప్రదాయము వైష్ణవులు విధిగా పాటించుచుందురు.

* *

తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వాహకోద్యోగిగా శ్రీవేంకటేశ్వరస్వామి పరమభక్తుడుగా సంవత్సరమునకొక పాశర భావము ననుభూతికి తెచ్చుకొని తనధర్మమును నిర్దుష్టముగా నిర్వహించి ముప్పైసంవత్సరములుగా భగవత్సేవను నిర్వహించిన ధన్యజీవి శ్రీ చెలికాని అన్నారావుగారు. వారి ఉద్యోగవిరమణ తరుణమున తిరుమల తిరుపతి దేవస్థానముల నూతన పాలకసంఘము వరముగా సమర్పించిన శ్రీవేంకటేశ్వరస్వామివారి దివ్యప్రసాదము.

# పరిచయము

'ఉపన్యాసరత్న - కవితావిశారద'
శ్రీ ధనకుధరం వరదాచార్యులు,
శ్రీలక్ష్మీనారాయణపురము, గుంటూరు-4

"ఆండాళ్ వైభవ" మను ఈ గ్రంథ రచయితలగు శ్రీ కల్లూరు చంద్రమౌళిగారు అమాత్యశేఖరులుగా, సంస్కృత విశ్వకళాపరిషత్సభా నిర్వాహకులుగా, సంస్కృత విశ్వవిద్యాలయ సంస్థాపకులుగా, "రామాయణసుధాలహరి" గ్రంథకర్తలుగా భద్రాచల కోదండరామాలయ జీర్ణోద్ధారకులుగా దేశమునకు సుపరిచితులు.

వీరి జన్మస్థానము గుంటూరుమండలమునగల మోపర్రు గ్రామము. జననము 1898. జననీజనకులు శ్రీయుతులు వెంకమాంబ, సుదర్శనార్యులు. స్కాట్లాండులో ఎబర్డిన్ విశ్వవిద్యాలయమున వ్యవసాయశాస్త్రము నందు పట్టభద్రులై, 1924లో స్వదేశమున కేతెంచి, శ్రీగాంధీమహాత్ముని శంఖారావమును విని ప్రభుత్వోద్యోగము "చేయనొల్లక" స్వాతంత్ర్యోద్యమములో పాల్గొని, మాతృదేశముపై అచంచల భక్తివిశ్వాసములను ప్రదర్శించిన వీరపురుషులు.

స్వాతంత్ర్యసమరములో ప్రముఖపాత్ర వహించి, సత్యాగ్రహ రంగమున పురోగమించి, దీర్ఘకాలము కారాగారవాస మొనరించిన త్యాగమూర్తులు.

కారాగారవాస మొనరించు సమయములలో సంస్కృతభాష నభ్యసించి, కాలక్రమమున ఆ భాషలో కూలంకషమైన అనుభవము

నార్జించి, శ్రీమద్రామాయణము నామూలాగ్రముగ నాలోకించి, అందలి మకరందమాధుర్యమును తనివితీర నాస్వాదించి, ఆ మాధుర్యమును ఆంధ్రమహాజనులందరకును చవిచూపిన మనీషులు.

1838 నుండి 1940 వరకు గుంటూరు జిల్లాబోర్డు అధ్యక్షులై తమ ప్రజ్ఞాపాటవములను ప్రదర్శించి, మండలవాసుల మన్ననలందిన మహనీయులు.

1947లో భారతదేశమున కాంగ్రెసుప్రభుత్వ మేర్పడిన సమయమందు, ఉమ్మడి మద్రాసు రాష్ట్రములో 1952 వరకు ఐదుసంవత్సరములు అమాత్యపదవి నధిష్ఠించి, సహకారసంస్థలను, స్థానికసంస్థలను చక్కదిద్దిన ధీమంతులు. ఆంధ్రరాష్ట్రమవతరించిన యనంతరము అమాత్యపదవి నలంకరించి, 1955 నుండి 1956 వరకు రెవెన్యూ దేవాదాయ ధర్మాదాయ శాఖలను నిర్వహించి, తమ నైపుణ్యమును వెల్లడించిన మేధావంతులు. విశాలాంధ్ర మవతరించిన తదుపరి, 1960 నుండి 1962 వరకు అమాత్యపదవి నధిష్ఠించి, దేవాదాయ ధర్మాదాయ సహకార శాఖలను నిర్వహించి, తమ పరిపాలనాదక్షతను సువ్యక్తముచేసిన రాజ్యాంగవేత్తలు.

ఆంధ్రరాష్ట్రావతరణానంతరము తాము అమాత్యులుగా నున్న సమయమున, శ్రీశైలక్షేత్రమును జీర్ణోద్ధరణ మొనరింపవలెనని సంకల్పించి అందులకొకసంఘమును సంస్థాపించి గుంటూరు పట్టణమున లక్షరూపాయలను భక్తులనుండి విరాళముగా సేకరించి, ఆలయపునరుద్ధరణ కార్యక్రమము నారంభించి, తమపదవిని సార్థకము చేసికొన్న పవిత్రచరిత్రులు.

విశాలాంధ్రమవతరించిన యనంతరము తాము అమాత్యపదవిని నధిష్ఠించియున్న సమయమున, ఆంధ్రప్రదేశమునఁగల సుప్రసిద్ధములైన దేవాలయములను పునరుద్ధరింపవలెనని సంకల్పించి, ఈ కార్యక్రమము నకు మహత్తరమైన ఒక పథకమును రూపొందించి, మొదట శ్రీభద్రాచల రామాలయ పునరుద్ధరణకై తాము పదివేలరూపాయలను విరాళముగా సమర్పించుటయే గాక భక్తులనుండి సుమారు 19 లక్షల రూపాయలు విరాళముగా సేకరించి, శ్రీభద్రాచలక్షేత్రమును కలియుగ వైకుంఠముగా తీర్చిదిద్దవలెనని ఉద్దేశించి, శ్రీరామచంద్రునియందు తమకుగల భక్తి ప్రపత్తులను ప్రదర్శించిన పరమ భాగవతాగ్రగణ్యులు.

శ్రీశైల భద్రాచలక్షేత్రములలో వీరు సంకల్పించిన దేవాలయ పునరుద్ధరణ కార్యక్రమములు నేఁటికిని అవిచ్ఛిన్నముగా జరుగుచుండుట సర్వులును సంతసింపదగిన విషయము.

బొంబాయిలో, శ్రీ కె. యం. మున్షీ ప్రభృతులచే సంస్థాపింప బడిన సంస్కృత విశ్వకళాపరిషత్పంచమ వార్షిక మహోత్సవమును 1955లో వీరు ఆంధ్రరాష్ట్రమునందమాత్యులుగా నున్న తరుణమున, నాఁటి రాష్ట్రపతియగు శ్రీ రాజేంద్రప్రసాదు మహాశయుల అధ్యక్షతన, తిరుపతి క్షేత్రములో నేర్పరచి, భారతదేశమునగల ప్రముఖ సంస్కృత పండితులను రావించి, వారి పాండిత్యప్రకర్షలను గుర్తించి, వారిని సముచితరీతిని సన్మానించి, సంస్కృతభాషయందు తమకుగల ఆద రాభిమానములు వెల్లడించిన విజ్ఞానవేత్తలు.

కేంద్రప్రభుత్వము నెలకొల్పనెంచిన ప్రథమ సంస్కృత విశ్వ

విద్యాలయమును తిరుపతిక్షేత్రములో సంస్థాపించి, సంస్కృతభాషా వ్యాప్తికి సముద్యమించిన సహృదయులు.

పరంపరాగతమైన శ్రీవైష్ణవ ధర్మవిజ్ఞానము, సహజసిద్ధమైన అంకురితదీక్ష వీరి కీర్తిపతాకకు వన్నెచేకూర్చినవనుట అతిశయోక్తి కావేరదు. "ఆండాళ్ వైభవము" అను ఈ రచన, వీరి భావనాబలము నకు, ఉభయ భాషాప్రావీణ్యమునకు, ఉభయ వేదాంతవిజ్ఞానమునకు, భక్తిప్రపత్తులకు ఒకమచ్చుతునక.

రచనలు: ౧. రైతు-రాజ్యాంగము, ౨. నానాదేశ రాజ్యాంగ ములు, ౩. భారతీయప్రతిభ, ౪. రామాయణసుధాలహరి, ౫. వేదామృ తము ఇత్యాదులు. ఇందలి "భారతీయప్రతిభ" ఆంధ్రవిశ్వవిద్యాల యమువారిచే బి. ఏ., తరగతికి కొంతకాలము పాఠ్యగ్రంథముగా నిర్ణ యింపఁబడినది. "రామాయణసుధాలహరి" ప్రముఖ తత్త్వశాస్త్రవేత్తల చేతను, పండితప్రకాండులచేతను, కవికంఠీరవులచేతను, పత్రికలచేతను పలువిధముల ప్రశంసింపఁబడినది.

ఈ రామాయణసుధాలహరిలో వాల్మీకిహృదయము నవలోకించి, అమందానందమునందిన పశ్చిమగోదావరీ మండలమునఁగల తణుకు నగర పండితమండలి, ఉస్మానియ విశ్వకళా పరిషదుపాధ్యక్షులగు డాక్టరు నూరి భగవంతముగారి యధ్యక్షతన 1956లో ఒక మహాసభ నేర్పఱచి అందు వీరికి, సంస్కృతాంధ్రభాషలో, సువర్ణసంశోభితము లైన స్వాగతపత్రములను, "ఆర్షవిద్యాలంకార" బిరుదమును సమ ర్పించి సన్మానించిరి.

ఈ మహనీయులు ప్రస్తుతము గుంటూరుపట్టణమున వర్ణశాలలో ప్రశాంతముగ కాలముగడుపుచు, గ్రంథరచనావ్యాసంగమున నిమగ్నులై యున్నారు.

ఇట్టి సమయమున భారతదేశములోఁ గల దివ్యక్షేత్రములలో ప్రసిద్ధివహించిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తల సంఘమునకు వీరు అధ్యక్షులగుట, కేవలము ఆంధ్రులకేగాక, భారతీయులందఱకును సంతోషదాయకమైన విషయము. మాన్యులైన శ్రీ చంద్రమౌళి మహోదయులు, పవిత్రమైన ఈ మార్గశిరమాసమున పదవీస్వీకారమొనరించి, వెన్వెంటనే ఈ ఆండాళ్ వైభవమును తిరుమల శ్రీనివాసభగవానుని పాదారవిందముల సన్నిధానములో భక్తికానుకగా సమర్పించి, ఆ భగవానునియందు వారికిఁగల అచంచల భక్తిభావమును వ్యక్తీకరించి, చిరస్మరణీయులైనారు.

ఈ "ఆండాళ్ వైభవము" భక్తలోకమునకు పెన్నిధానము. ఇట్టి ఉత్తమగ్రంథములను ఇంకను శ్రీ చంద్రమౌళిగారు రచించి, భాషాసేవయు, భగవత్సేవయు చేయవలెనని మా ఆకాంక్ష.

భక్తశిరోమణియైన శ్రీ చంద్రమౌళిగారికి శ్రీ వేంకటాచలపతి సర్వశుభములను ప్రసాదించి సంరక్షించుగాక.

గుంటూరు,
4–1–64

ధనకుధరం వరదాచార్యులు.

# శ్రీఆండాళ్ వైభవము

## ఆరంభవాక్యము

మధురజిల్లా - రామనాథపురము తాలూకాలో 'ధన్విపుర' మను నొకగ్రామముకలదు. దానిని 'శ్రీవిల్లిపుత్తూరు' అనియు నందురు. అందు వెయ్యార్ (వేఱు) తెగకు జెందిన బ్రాహ్మణవర్ణములో,—ముకుందుఁడు, పద్మాదేవియను దంపతులు కలరు. వీరికి భట్టనాథుఁడను పుత్రుఁడు జన్మించెను. ప్రహ్లాదుని వలె ఈ బాలుఁడును జన్మముతోడనే విష్ణు భక్తుఁడై విలసిల్లెను. భగవానుఁడు తనను తన చిత్తానుసారముగా వినియోగించుకొనవలె నని ఈ బాలుని ఆకాంక్ష. ఇతఁడు నిరంతరము శ్రీమహావిష్ణువును ధ్యానించుచుండెడివాఁడు. అందువలన, ఈ బాలుడు 'విష్ణుచిత్తుఁడు' అను నన్వర్థనామముతో వ్యవహరింపఁబడుచుండెను. ఆ కాలమున పాండ్యరాజగు వల్లభదేవుఁడు మధురాపట్టణమును పరిపాలించుచుండెను.

విష్ణుచిత్తుఁడు ఒక పుష్పవనమును నిర్మించి, శ్రీవిల్లిపుత్తూరు నందు వేంచేసియున్న వటపత్రశాయికి నిత్యము పుష్పమాలాకైంకర్యము చేయుచుండెడివాఁడు. వటపత్రశాయి యనఁగా శ్రీకృష్ణభగవానుఁడని యర్థము. ఒకనాఁడు విష్ణుచిత్తుండు తులసీవనములో మొక్కలకు పాదులు త్రవ్వుచుండ, అందు ఒక తులసీమొక్క కడ ఆకస్మికముగ, కన్నుల పండువుగ ఒక బాలిక కన్పట్టెను. పూర్వము కర్మయోగి యగు జనక మహారాజునకు యజ్ఞ వేదికను దున్నునపుడు, నాగటి చాలులో సీతాదేవి లభించిన చందమున, భక్తియోగి యగు విష్ణుచిత్తునకు ఆండాళు అయోనిజయై లభించెను. ఈ బాలిక సౌందర్యమునకు విధి;

దివ్యతేజమునకు నిలయము, ఈ బాలికను భగవాముఁడు తనకు ప్రసా దించిన వరముగ విష్ణుచిత్తుడు భావించి, ఆమెకు 'గోదా' యని నామ కరణము చేసెను.

## బాల్యదశ

ఈ గోదాదేవి, బాల్యదశయందు సైకతగృహములతో - చిత్ర విచిత్రములైన బొమ్మలాటలతో ముద్దులొలుకు మురిపెంపు బాల్యచేష్టలతో ఆనందముగ కాలమును గడుపుచుండెను. ఈమెకు బాల్యముననే, బృందావన బాలకృష్ణుఁడు యమునాతీరములో విహరించిన గాథలను విష్ణుచిత్తుఁడు విన్పించుచుండెడివాఁడు. కృష్ణభక్తి ప్రబోధకములైన గీత ములను నేర్పుచుండెడివాఁడు. పెరియాళ్వారుగా ప్రసిద్ధిచెందిన ఈ విష్ణు చిత్తుఁడు భక్తపరవశుఁడై, తనను యశోదాదేవిగ దలంచుకొని, ఊయ లలోఁ గల బాలకృష్ణుని లాలించు చున్నట్లును, ఆ గోపాలుఁడు తప్ప టడుగు లిడుచున్నట్లును, గోవులను పాలించుచున్నట్లును భావించి, యానందించుచుండెడివాఁడు. ఈ భావములనే, ఈ భక్తశిఖామణి తన పవిత్రరచనములలో ప్రతిబింబింపఁజేసెను. ముద్దుల మురిపంపువట్టియగు ఆండాళుమగూడ ఇట్టి దివ్యభావగీతికల ప్రభావములో ముంచివైచి, పరమ భక్తురాలినిగ బాసిల్లఁజేసెను.

## భక్తిభావము

ఆళ్వారులు సహజముగా విష్ణుభక్తులు, తమ్ముఁ స్త్రీలుగ భావించు కొని, గోపికలుగ దలంచుకొని, కృష్ణ భక్తిలో లీనమగుచుండెడివారు. జన్మముతోడనే ఆండాళ్ మహిళగా నవతరించినది. అట్లు మహిళగా నవతరించుటయే ఆమెకు మహాభాగ్యమయ్యెను. ఈ కారణముననే

లమెకు సంప్రాప్తించిన దైవానుభూతులు సహజ వికాసములై శోభిల్లినవి. తాను ప్రేమమునకు కేంద్రమై భగవంతుని భర్తగ భావించి, ఆరాధించు చుండెను. ఈ భావనము మధురమధురమై, సహజసుందరమై, కమల కోమలమై విలసిల్లెను. ఈ సహజ భక్తిభావములను ఆమె రచించిన 'తిరుప్పావై', 'నాచ్చియార్ తిరుమొళి' అను గ్రంథములలో నవలో కింపఁగలము. ఆమెకు గల కృష్ణభక్తి, పవిత్రప్రేమము, నిరాటంకముగ, ఏకధారగ, నిరంతరము ప్రవహించు నిర్మల గంగాస్రవంతి వంటిది. అందు - జీవాత్మ, పరమాత్మలో విలీనమగు నాకాంక్షనే గాంతుము.

## ప్రబంధములు

తన 'తిరుప్పావై' గ్రంథమున వ్రతమునకు సంబంధించిన నియమ నిష్ఠలను నిర్వచించెను. 'నాచ్చియార్ తిరుమొళి' గ్రంథములో భగవంతుని యెడబాటు తనకు గల్గించిన తీవ్రమైన యావేదనమును, తదుపరి ఆ భగవంతునితో తనను సంప్రాప్తించిన సంయోగమును కీర్తించెను. 'తిరుప్పావై' ప్రబంధమున ముప్పదిపాశురములు కలవు. అవి — సుందరశోభితసులలితకళానందపన్నములు; రసమయములు; భక్త్యావేశజనితములు, పరమ భక్తితో పారవశ్యమును జేకూర్చు ఇట్టి పాశురములు మరియే ప్రబంధములందును కానరావు. కవిత్వము, గానము, భక్తి, తత్త్వము ఇత్యాదులన్నియును అన్యోన్యములుగ లంకె వైచుకొని, సమ్మిళితములై, భక్తులకు భగవద్దర్శన మొసంగు దివ్యగీత ములై, ఈ పాశురములు వెలుగొందుచున్నవి.

## వ్రతాచరణము

తనను గోపికగఁ దలంచుకొని, గోకులమునఁగల గోపికలనందఱను

యమునాస్నానమునకు వన్నద్ధులుకండనియు, వ్రతాచరణమునకు ఇట్టి స్నానమావశ్యకమనియు ఆండాళ్ ప్రబోధించును. 'శ్రీమన్నారాయణుఁడే వరతత్త్వము' అను విశిష్టాద్వైతుల మూలసిద్ధాంతముతో ఈ ప్రబంధము ప్రారంభమగును. శ్రీమన్నారాయణుఁడే మన కర్మలనుచితఫలముల నొసంగును. అతని కరుణాకటాక్షవీక్షణము ప్రసరించిన వారికే ఆ దివ్య ఫలములు లభించును. ఇట్టి భావములు ఈ ప్రబంధములో ఆమె నిర్వచిం చును. వ్రతాచరణము ఆవశ్యకమని ప్రబోధించును, నియమ నిష్ఠలను పాటింపవలెనని యుద్ఘాటించును. బ్రహ్మచర్యాశ్రమమును ప్రశంసించును.

"క్షీరసాగరశయనుఁడగు భగవంతుని కీర్తింతము. పాలు, నేయి మున్నగు భోగములను విసర్జింతము. కంటికి కాటుక నిడుట, కురులలో విరులను ధరించుట మున్నగు బాహ్యాలంకారములను దూర మొనరింతము. పూజ్యులైన మన పూర్వులు నయనించిన సుపథమునవే ప్రయాణింతము. వాచాలుర వృథాలాపములకు, సోమరుల శుష్కవాదములకు, పామరుల వ్యర్థకాలక్షేపములకు, దుర్మార్గుల దురాచారములకు కడుంగడు దూరముగ మందము. మన స్వీయనంపదను శక్తికొలఁది పరులక్షేమముకొఱకు విని యోగింతము. ముక్తికై నిరంతరము ప్రయత్నింతము." ఇట్టి నియమము లతోఁ గూడిన వ్రతపాలనమున నిమగ్నయైయున్న తరుణమున, శంఖ చక్రాద్యాయుధముల ధరించి, సర్వాలంకారసంశోభితుఁడై దివ్య తేజ స్సంపన్నుఁడై శ్రీకృష్ణుఁడచ్చటికి వేంచేయును. వారొసంగు సర్వపదార్థ ములను లప్యాయముగా వారగించును.

"కరముల గాజులను, కాలియందియలను, కంఠాభరణములను, సుగంధ సమధామములను, (పట్టు) పీతాంబరములను అలంకరించు

కొందము. పాలతో పరిపక్వమై, నేతితో సమ్మిళితమైన పరమాన్నమును శ్రీకృష్ణుని సహపంక్తిని ఆరగింతము." ఇట్లు తాము ప్రదర్శించిన స్వాతంత్ర్యమునకు క్షమింపుమని శ్రీకృష్ణుని అర్థింతురు.

"భగవంతుఁడవగు ఓ గోవిందా! మా యీ ప్రాతఃకాల ప్రార్థనముల నాలకింపుము. నీవు బాలగోపాలుఁడవై అవతరించి, గోపగోపికలమగు మాతో నొక్కఁడవుగ సంచరించుటచే, మా సేవలను నీవు స్వీకరింపక తప్పదు. ఈ జన్మములోను, రానున్న జన్మలోను మేము నీ పాద పద్మములనే భక్తిప్రపత్తులతో సేవింతుము. ఇతర కాంక్షలు మాకు లేనేలేవు." ఇట్టి మధురభావములతో ఈ ప్రబంధమంతయు ఆపాత మధురముగ విరాజిల్లుచుండును.

గోపబాలుర గోగణపాలనమును, గోపికల దధి మథనమును గాన మొనర్చును. నిద్రమండి మేల్కొన్న సింహమునుబోలు గోపసింహమును ఆమె కీర్తించును. ఆండాళ్ గీతికలు, భగవంతుని నిర్వ్యాజ్య కరుణా కటాక్షమును కరతలామలక మొనర్చును. ఆ గానము దుష్టుని సంహరించుటకు గాక, వానియందు గల దుష్టత్వమును దూరమొనరించి, శ్రేయమును చేకూర్చును. ఆమె భగవంతుని సౌందర్యమును, సౌశీల్యమును, సౌలభ్యమును కీర్తించును. శ్రీకృష్ణుఁడు ఒక్కఁడే పురుషుఁడు. కాదు - పురుషోత్తముఁడు. తదితరులందఱును ఆయనపై ఆధారపడి యున్నవారే; ఆయనచే భరింపఁబడుచున్నవారే. కావుననే, ఆతని తమ నాథునిగా భావించిరి. జగన్నాథునిగా సంభావించిరి. ఆయనకు సేవ లొనర్చి, అపారమైన ఆనందమనుభవించిరి.

చిన్ననాటినుండియు తన ముద్దుబిడ్డయగు గోదాదేవికి విష్ణుచిత్తుఁడు కృష్ణభక్తిని అలవఱచి, సుస్థిరమొనర్చెను. ఆమెయును పూఁదోటలకు నీరు వోయుచు, పూలుకోసి మాలలు కట్టుచు, భగవత్కైంకర్యార్థము ఆ పూలమాలలను తన తండ్రి కొసంగుచు, అతనికి చేదోడు వాదో డుగా నడయాడుచుండెడిది. తన తండ్రి నిత్యము గావించు ప్రబోధ ప్రశావమును, గోకుల నివాసియగు గోపాలకృష్ణుని బాల్యచేష్టలును, ఇతర జీవితగాథలును ఆ గోదాదేవిని మైమఱపించుచుండెడివి. గోపికలను గూడి బాలకృష్ణుఁ డొనర్చు సరసనల్లాపములు ఆమె హృదయమున గాఢముగా హత్తుకొనెను. తాను గోపికగ జన్మించలేదే యని విలపించుచుండెడిది. తాను వివాహమాడవలసి వచ్చినచో శ్రీకృష్ణపరమాత్మనే భర్తగా బడయ నాకాంక్షించుచుండెడిది. శ్రీకృష్ణుని-ప్రేమశ్యాముని‌గ, దయార్ద్రహృదయునిగ భావించి, ప్రత్యక్షముగ ఆలోకించుచుండెడిది. గోపికవలె తన్నలంకరించుకొని, కృష్ణుని మధుర ప్రేమకు పాత్రురాలినిగ భావించుచుండెడిది. ఇట్టి భావపరంపరలో లీనమై, తన్మయత్వమును బొంది, నిత్యము తన తండ్రి వటపత్రశాయికి సమర్పించు పూమాలలను తాను ధరించి, తన సౌందర్యమును నిలువు టద్దమున జూచుకొని, ముగ్ధురాలగుచుండెడిది. ఇట్లొక దినమున, పుష్ప మాలల నలంకరించుకొని యున్న తన పుత్రికను జూచి, విష్ణుచిత్తుఁడు విభ్రాంతుఁడయ్యెను. భగవత్కైంకర్యమునకై ఉద్దేశింపఁబడిన దామము లను ఆమె ధరించునని ఆతఁడెన్నడును తలఁపలేదు. ఈ అపచారము నకు విష్ణుచిత్తుఁడు విచారపడుచు — "ముద్దుబిడ్డా! భగవంతునకు సమర్పించు మాలలను ధరించుట కెట్లు సాహసించితివి? భక్తి భావ ముతో ఈ మాలలను స్వామికి నిత్యము నేను సమర్పించునట్లు నీకు

తెలియదా ? ఇట్టి యపచారమును నీవు చేయదగునా ?" అని తన తనయను అనేకవిధముల మందలించెను. తండ్రి మాటలు వినినంతనే గోదాదేవి పారవశ్యమునుండి మేల్కొని, సామాన్యమానవ స్థితిని బడసి, వెక్కి వెక్కియేడ్వసాగెను. విష్ణుచిత్తుడును నిత్యము వటపత్రశాయికి పవిత్రహృదయముతో సర్పించు పుష్పమాలలను వాడు నమర్పింపక జాలనందులకు విచారగ్రస్తుడై, వెడలి పోయెను. ఆనాటి రాత్రి ఈ విషయమునే మనస్సున జింతించుచు నిద్రావశుడయ్యెను. ఆ స్థితిలో ఒక కాంతిరేఖ ఆయన కన్నులకు గానుపించి, దివ్యతేజోవంత మగు అర్చాస్వరూపముదాల్చి ఇట్లు వలికెను. 'విష్ణుచిత్తా ! పూదామము లను నేడు నాకేల సమర్పింపలేదు ?' ఈ ప్రశ్నమునకు విష్ణుచిత్తుని ప్రత్యుత్తరమేలేదు. అంతట మరలా నా దివ్యమూర్తి — 'నీ గృహమున నీకు పెంపుడు పుత్రికగమన్న బాలిక యెవ్వరో నీ వెఱుంగజాలకున్నావు. ఆమె సామాన్యమానవ బాలిక కాదు. ఆబాలిక నాకుజెందినది. ఆమె ముడిచి విడిచిన పుష్పదామములనే సమర్పించుట నాకత్యంతము వాంఛ నీయము. అవి నాకెంతగనో ఆనందమును చేకూర్చును.' అని పలికి అదృశ్యుడయ్యెను.

విష్ణుచిత్తుడప్పుడు తన కూమార్తె నిజ తత్త్వమును గ్రహించి, ఆమె - భగవదనుగ్రహమును బడసిన దేవియని తలంచెను. ఆ నాటి నుండి 'ఆండాళ్' నామము ఆమెకు అన్వర్థమైయలరారెను. ఆండాళ్ తన భావములను, మనస్సును, హృదయమును కృష్ణునియందే లగ్న మొనర్చుకొనెను. తన సఖులు తమ తమ భర్తలకడకేగుటను గాంచి, కృష్ణుడు తనకడకేల రాడని చింతింపసాగెను. గోపికలు తమకు

యోగ్యులగు భర్తలను బడయుటకు కాత్యాయనీదేవి నారాధించుచుండెడి వారుకదా! ఆ దేవిని ఏల యారాధింపరాదని గోదాదేవియు దలంచు చుండెడిది. విష్ణుచిత్తుఁడును - అనవరతము కృష్ణభక్తినే ప్రదర్శించు చున్న తన బిడ్డ వివాహవయస్కయగుట గాంచి, తగిన వరునిగానక, ఆమెనే తనకు తగిన వరుని వరించుకొమ్మని నుడివెను.

'ఇంతకుమున్నే నేను నా నాథుని నిర్ణయించుకొంటిని. శ్రీ మన్నారాయణుఁడే నా నాథుఁడు. ఇతరుని కన్నెత్తియైన గాంచజాల' నని యామె ప్రత్యుత్తరమిచ్చెను. ఈ పలుకులు విష్ణుచిత్తుని ఆశ్చర్య చకితుని గావించెను. తాను వివాహమాడనొల్లక, ఈ విధముగ బల్కు చున్నదని అతఁడు భావించి — 'అమ్మా! నీ మాటలను నేనును ఆమో దింతును; ఆనందింతును. కాని, మన భరతఖండమున — శ్రీమన్నా రాయణుఁడు నూటయెనిమిది దివ్య క్షేత్రములలో అర్చామూర్తియై, సేవ సాయించు చున్నాఁడు కదా; ఇందు — ఏ క్షేత్రమునగల మూర్తిని నీవు వరింపదలచితివో తెల్పుమని ప్రశ్నించెను. అందులకామె, తన తండ్రిని ఆయా క్షేత్రములందలి అర్చామూర్తులను గూర్చి వివరింపుమని కోరెను. విష్ణుచిత్తుఁ డానందభరితుడై, మధురయందలి శ్రీకృష్ణుని వర్ణించెను. ఆ వర్ణనమునకామె తలలోని కురులు నిక్కబొడుచుకొనెను. తిరుమల వేంకటేశుని వైభవము పల్కునంతనే, ఆమె ముఖారవిందము వికసించెను. కాని, శ్రీరంగధాముఁడగు శ్రీరంగనాథుని వర్ణింపగనే, ఆమె యొడ లుప్పొంగిపోయెను. అప్పుడు, శ్రీరంగనాథునే ఆమె వరించెనని విష్ణుచిత్తుఁడు విస్పష్టముగ గ్రహించి, 'ఇది యెట్లు సంభవమగు' నని చింతించుచుండ అచట శ్రీరంగనాథుఁడు — శ్రీవిల్లి

పుత్తూరున కేగి, ఆండాళును గొనిరండని తన అర్చకులకాజ్ఞయొసం గెను. అంతటవారు - శోభాయమానముగ నలంకరింపఁబడిన నంద లముతో గజతురగాది వాహనములతో - వివిధ వాద్యములతో వయనో త్సవముగా శ్రీవిల్లిపుత్తూరున కేతెంచి, ఆండాళును ఆందోళికయందు గూర్చుండబెట్టుకొని, శ్రీరంగముచేరిరి. ఈ వార్త ఆ ప్రాంతమంతయు క్షణములో వ్యాపించెను. విచిత్రమైన ఈ వివాహమును వీక్షించుటకై, తండోపతండములుగ ప్రజలచ్చట గుమిగూడిరి. ఆందోళిక, శ్రీరంగ నాథాలయము ప్రవేశించెను. ఆండాళ్, ఆ శ్రీరంగనాథుని ధ్యానించు (కొను)చు పల్లకినుండి దిగి, మెల్ల మెల్లన గర్భాలయమునకు వెడలెను. తదుపరి జనులెంతగా నిరీక్షించినను తిరిగి ఆమె వెలుపలకు మరలి రాలేదు. విచిత్రమైన ఈ సన్నివేశమును విష్ణుచిత్తుఁచూచి విలపించు చుండెను అప్పుడు శ్రీరంగనాథుఁడు 'విష్ణుచిత్తా! విచారపడకుము. నీ తనయను నేను భార్యగా స్వీకరించితిని. ఇప్పుడు నీవు నాకు మామ వైతివి.' అని ఊరడించెను. విష్ణుచిత్తుఁడంతట శ్రీవిల్లిపుత్తూరు చేరి, మిగిలిన జీవితమును గడపెను. ఇది ఆండాళును గూర్చిన చరిత్రాత్మక మైన దివ్యగాథ.

## అనన్యభక్తి ప్రభావము

ఆండాళు మహాభక్తురాలు. ఏకాగ్రభక్తికి కొలికిపూస. కనుక, భక్తులలో నాయికమణియై ప్రకాశించెను.

'గోపాలకృష్ణుఁడే సర్వస్వము. గోపాలుఁడే ప్రాప్యము. గోపాలుఁడే ప్రాపకము' అని తలంచి కీర్తించిన ప్రసన్నులు గోపికలు. అనన్యమైన భక్తితత్త్వమును ఈ గోపికలలో మనము కానగలము.

యోగులును, ఋషులును శ్రీకృష్ణుని ప్రార్థించి పావనులైరి. భక్తులు భగవంతుని సేవించి పవిత్రులైరి. రాధప్రేమము పరమ పవిత్రము. చైతన్యప్రభువు దీనినే గానమొనర్చెను. జయదేవుని గీతగోవిందము గోపికల భక్తికి ప్రతిబింబమనియే భావించవచ్చును. ఆళ్వారులు తమ్ము స్త్రీలుగ దలంచి, గోపికలుగ భావించుకొని, భగవద్భక్తి సంశోభితములైన జీవితములతో విలసిల్లిరి. ఆళ్వారులలో ఆండాళ్ ధృవతార. ఈమె సహజముగా స్త్రీ కావున అనన్యమైన తన భక్తి ప్రభావముచే ఆధ్యాత్మిక దివ్యతేజస్సును ఆవిర్భవింపజేసి, ఆదర్శ భక్తవారీ శిరోరత్నమై దీపించెను. మఱియును ఈ మహాభక్తురాలు శ్రీ రంగనాయకియై చిరస్మరణీయగా విరాజిల్లినది.

## తిరుప్పావై ప్రభావము

శ్రీకృష్ణభగవానుఁడు 'మాసానాం మార్గశీర్షోఽహమ్' అని భగవద్గీతాశాస్త్రమున వక్కాణించియున్నాఁడు. ఈకారణము వలన, శ్రీకృష్ణభగవానుని ఉపాసించుటకు మార్గశీర్ష మాసము ఉత్తమోత్తమ మైనదనియు, అతి ప్రధానమైనదనియు, విశేషఫల ప్రదమైనదనియు మనము గ్రహింపవచ్చును.

శ్రీవైష్ణవ సంప్రదాయులు యుగ యుగములుగ తిరుప్పావై ప్రబంధమునకును, మార్గశీర్షమాసమునకును ఎడతెగని సంబంధ బాంధవ్యములను నెలయించిరి. శ్రీకృష్ణునకు తాను ప్రియురాలుగా భావించిన గోదాదేవి, ఆ పరమాత్మ తన కత్యంత ప్రియముగా సంభావించిన మార్గశీర్షమాసములో వ్రతాచరణమునకు ఉద్యమించెను. తిరుప్పావై

పరాభక్తి సంజనిత భావబంధురము. అమృత వాహినియై, ఆనందా యకమై, భావమధురములైన పాశురములనద్దీతించు ఉత్తమ కావ్యము, దివ్యప్రబంధము. శ్రీవైష్ణవగృహములలో విష్ణ్వాలయములలో మార్గశిర్ష మాసమున భగవథారాధనమందు ఈ తిరుప్పావై ప్రబంధమును సంధింప బడుచున్నది. కొందఱు, తమ మధుర కంఠములతో ఈ పాశురములను గానమొనరించుచు, శ్రోతలను తన్మయుల గావింతురు. ఈ దివ్య ప్రబంధము శ్రీవైష్ణవ సంప్రదాయమునకు తలమానికమై యలరారు చున్నది. శ్రీభగవద్రామానుజులు ఈ తిరుప్పావై ప్రబంధమును పరమ పవిత్రముగ భావించి, భక్తిప్రపత్తులతో పమసంధానముచేయుచు, ప్రజానీకమున భక్తి ప్రబోధ ప్రచారముల గావించుచుండెడివారు. నాఁటి నుండియు, ఈ ప్రబంధము విశేషముగ ప్రఖ్యాతి వహించినది. ఇందు వలననే, శ్రీభగవద్రామానుజులను 'తిరుప్పావైజీయర్' అని ప్రజలు ప్రస్తుతింపసాగిరి.

శ్రీవైష్ణవులు మాసములందలి దినములను తిరుప్పావై పాశుర ములతో గణించు పవిత్రాచార సంపన్నులుగ వెలుగొందుచున్నారు. ఇందుగల ముప్పది పాశురములను శ్రీవైష్ణవులు భక్తితోగాన మొనర్చు చుందురు. ఇంతేగాదు — మాసము నందలి మొదటిదినమున, మొదటి పాశురమును, రెండవదినమున రెండవపాశురమును ఇట్లు క్రమముగ ముప్పది పాశురములను ముప్పది దినములు గానమొనర్తురు. ఒక్కొక్క పాశురము ఒక్కొక్క దినపు పాశురముగ భావించుటయేగాక, వాని ప్రథమాక్షరములతో మాసములందలి దినములను బేర్కొను సదాచారము గలిగియుండిరి. తిరుప్పావై ప్రబంధము తన దివ్యశక్తిని, విశేష

ప్రతిభను ఈ విధముగ శ్రీ వైష్ణవ సంప్రదాయులలో ప్రసరింపఁజేసి, హిందూమతమునకొక శనంపపమైన శోభను ప్రసాదించెను. తిరుప్పావై యనగా - దివ్యబాలిక యని యర్థము. అందువలననే అది ఆండాళ్ అను నామమునకు ప్రతినామముగ ప్రతిభాసించుచున్నది. శ్రీవైష్ణవులు మార్గశీర్షమాసమున తరుప్పావైని పవిత్రహృదయములతో వాలాపించుచు, గోష్ఠిని గావించుచుందురు. గోష్ఠియనఁగా, విష్ణుభక్తుల సమావేశము. అటి - దివ్యములైన భక్తిగీతములను గానమొనరించుచు, ఆరాధనము లను గావించుచు ఈ భాగవతోత్తములు కాలక్షేపము చేయుచుందురు.

తిరుప్పావై యనఁగా - పవిత్రమగునోము. ఇందుగల ముప్పది పాశురములలో - ఇరువది తొమ్మిది పాశురములు 'ఏలోర్ ఎంపావై'తో అంత్యమగుచుండ, కడపటి ముప్పదియవ పాశురము మాత్రము 'ఎంపావై'తో అంతమగును.

'ఎంపావై' యనగాఁ సరళ భావమని యర్థము. కాఁబట్టి, 'ఏలోర్ ఎంపావై'కి మూలము నోము పరమేయని మనువచ్చును. ఆండాళుకు శ్రీకృష్ణ పరమాత్మయందుగల పవిత్రప్రేమయే తిరుప్పావై ప్రబంధమునకు బీజము. శ్రీకృష్ణునియందు ఆమెకు గల ప్రేమము విశాలమై, అగాధమై, ప్రబలమై, తీవ్రమై, సర్వవ్యాప్తముగ విలసిల్లసాగెను.

ప్రేమ పథమున పయనించుట సులభసాధ్యముకాదు అందు నను - శ్రీకృష్ణునియందు ప్రేమ కల్గుట, అతని యనుగ్రహమును బడ యుట అత్యంతము కష్టతరము. శ్రీ గోదాదేవి శ్రీకృష్ణ ప్రేమ పథాను గమనమునను, శ్రీకృష్ణ సంశ్లేషాకాంక్షయందును నిరుత్సాహము,

దైన్యము, ఆవేదనము పొందియే యుందును. అట్టి దీనావస్థయందు, తన తండ్రియగు విష్ణుచిత్తుఁడు శ్రీ మద్భాగవతమునందలి భక్తిపూరితములైన చరిత్రముల నామెకు చెప్పుచుండెడివాఁడు. ఉత్సాహమును, ఉద్రేకమును ఉద్దీపింపఁజేయుచుండెడివాఁడు. భాగవతమునందలి కాత్యాయనీ వ్రతానుష్ఠాన విధానమును విస్పష్టముగ వివ్వించుచుండెడివాఁడు.

నిరంతరము శ్రీకృష్ణపరమాత్మధ్యానములో పరాయణులైన గోపికలు, ఈ కాత్యాయనీ వ్రతమును, నియమనిష్ఠలతో – నిశ్చలభక్తితో నమష్ఠించుచుండెడివారు. వారలు – తమకు శ్రీకృష్ణ భగవానుఁడే నాథుఁడు కావలెనని అభిలషించుచుండెడివారు. తమదేశము సుభిక్షమై నకాలమున మేఘములు వర్షించి, సస్యములు పుష్కలముగ ఫలించుటకును, శ్రీకృష్ణుని ప్రేమ ప్రవాహము తమపై పరిపూర్ణముగ ప్రసరించుటకును గోపికలు ఈవ్రతమును అనవరత మనుష్ఠించుచుండెడివారు. తదనుసారముగ, విష్ణుచిత్తుఁడును. తన ముద్దుబిడ్డయగు గోదాదేవికి ఈ వ్రతమునుగుఱించి, విశేషముగా బోధించుచుండెడివాఁడు. ఆమెయును–నిశ్చలమైన మనస్సుతో, అచంచలమైన భక్తిభావముతో ఈ వ్రతమును శ్రద్ధగనాలించి. పాలించుచుండెడిది. తనను గోపికగా భావించుకొని, కృష్ణభక్తి ప్రబోధకములైన గీతములను గానము చేయుచుండెడిది. తనను గోపికగను, తన జన్మస్థానమగు శ్రీవిల్లిపుత్తూరును గోకులముగను, ఆ దివ్యక్షేత్రమున అర్చామూర్తియై విరాజిల్లు వటపత్రశాయి దేవాలయమును నందగోపాలుని మందిరముగను, వటపత్రశాయియగు గోపాలుని శ్రీకృష్ణునిగను, ఆమె సహచారిణులగు సఖులను గోపికలుగను తలంచుచుండెడిది. ఇట్టి మధురభావములతో - 'తిరు

ప్పావై' పాశురములను శ్రవణానందముగ గాన మొనరించుచుండెడిది. గోపికలనుగూడి, గోపాలుని మందిరమునకేగి, వ్రతమహత్వగానముతో శ్రీకృష్ణుని ప్రాతఃకాలముననే నిద్రనుండి మేల్కొలిపి, వానితోగూడ ప్రాతస్స్నానమునకై ఆ గ్రామపరిసరమున గల 'తిరుముక్కుళం' అను నదికి బోవుచు, దానినే యమునగా భావించుచుండెడిది.

తిరుప్పావై ప్రబంధమున ముప్పదిపాశురములు కలవు. అందు మొదటి అయిదు పాశురములు ఆండాళు తన సహచరిణులగు సఖీమణులతో రాత్రి ప్రథమయామమున శ్రీకృష్ణుని సన్నిధికి వయనమై, వానిని జేరుటకు గానమొనర్చెడిది. తననోమును సక్రమముగా కొనసాగింప కృష్ణసహాయము నర్థించుచు, పెంధలకడనే వానిని మేలుకొలుపు ఉపోద్ఘాతముగ ఆ పాశురములు గానము చేయఁబడినవి. తమిళనాటి ఈ దివ్యబాలిక, తన్ననుకరింపుడని మొదటిపాశురమున తన సహచారిణులను సంబోధించును. "దివ్యామృతము నాస్వాదింప నభిలషించువారు నాతో రండు" అని యెలుగెత్తి గానమొనర్చును. భగవద్గుణానుభవము వలన జీవితము సార్థకము కావలెననియే ఈ సాధ్వీమణి ఆకాంక్షించెను. తన వ్రతనియమములను రెండవపాశురమున నిర్దేశించెను. ఇట్టి వ్రతాచరణమువలన లభించు అమృతఫలమును మూఁడవపాశురమున ప్రవచించెను. వరుణదేవుని నాల్గవపాశురమున ప్రార్థించెను. త్రికరణశుద్ధిగా భక్తిప్రపత్తులతో శ్రీకృష్ణభగవానుని ఆరాధించినయెడల, పాపసంచయమంతయు ప టా పం చ ల గు న ని అయిదవపాశురమున ప్రబోధించెను.

ఆండాళు, నిశాసమయమునందును నిద్రింపక, ఉషఃకాలముననే ప్రతిగృహమునకేగి సఖీజనమును మేల్కొలిపి, స్నానాద్యనుష్ఠాన

మునకు, వ్రతాచరణమునకు వారల నుద్యుక్తుల గావించుచుండెది. ఈ యంశములు, ఆరవ పాశురమునుండి పదునైదవ పాశురమువఱకు మనకు విశదీకరించును. ఈ పాశురములందలి సుందర సుమధుర సులలిత పదజాలములు, పవిత్ర భావములు, తమిళ భాషావేత్తలకే అనుభవైక వేద్యముయి.

శ్రీకృష్ణభగవానుని ఒకపరి కీర్తించుచు, ఒకతరి భయపెట్టుచు. ఇంకొకమారు గేలిసేయుచు, తన సఖులకు శ్రీకృష్ణ సంశ్లేష సందేశము నందించుచుండును. ఈ గీతికలను అందును ముఖ్యముగా మేలు కొలుపు పాశురములను ఆళ్వారులు నిత్యము అనుసంధించుచుండెడి వారు. ఆండాళును నిత్యము వీనిని గానయుక్తముగ పారాయణ మొనర్చుచుండెడిది. శ్రీకృష్ణ భక్తురాండ్రగు తన సఖులను తమను, మండి మేల్కొలుపు పదిపాశురములను పాడుచుండెడిది. ఈ పాశురముల మనోహర దివ్యగానమే ఆ పల్లెసీమను పవిత్రముగ, ప్రశాంతముగ, నిర్మలముగ గావించుచుండెడిది. ఆమె గానమొనరించిన జానపద ములు, పాడిన పల్లియగీతికలు ఇవియే.

శ్రీవిల్లిపుత్తూరునందలి బాలికలనందఱను తనతో గల్పుకొని, నందగోపాలుని మందిరమున కరుగుచున్నట్లు భావించి, ఆనందోద్వేగ ముతో ఆండాళు గానమొనర్చెను. శ్రీకృష్ణభగవానుని ఆలయమునకేగి తన చేతులతో తలుపులు తట్టుచు, ప్రియురాలగు నప్పిన్నతో నిద్రించు చున్న శ్రీకృష్ణుని సన్నిధికి తన సహచర బృందముతో నరిగి 'మా హృదయములను తెలిసి, మా యాకాంక్షలను విన్నవించుటకు మార్గము నొసంగు' మని, పదునారవ పాశురమున ద్వారపాలకుని

ప్రార్థించును. నిద్రించుచున్న యశోదను, నందగోపాలుని, బలరాముని మేలుకొమ్మందని పదునేడవ పాశురమున వర్ణించును. కాని వారు మేల్కొనకుందున, తాము ప్రథమమున శ్రీకృష్ణుని భార్యను ప్రార్థింపక, వక్రమార్గము నవలంబించితిమని తమ పొరపాటును గుర్తెఱుగుదురు. శ్రీకృష్ణుని భార్యను పదునెనిమిదవ పాశురమున ప్రార్థింతురు. శ్రీకృష్ణ అందుపై భగవానుని, శ్రీదేవిని పందొమ్మిది, ఇరువదవ పాశురములలో ప్రార్థింతురు.

'మేము అహంకార మమకారములను విసర్జించి, నిర్మలములైన అంతఃకరణములతో - పవిత్రములైన హృదయములతో భగవత్సన్నిధానమును కేతెంచితి' మని ఇరువదియొకటి, ఇరువదిరెండవ పాశురములలో విజ్ఞాపన మొనర్చును.

భగవానుని మృగరాజువలె సింహాసనము నధిష్ఠింపుమనియు, తమ ప్రార్థనములను ఆలకించుటకై తమ విజ్ఞాపన పత్రములను అతనికి సమర్పింతుమనియు ఇరువదిమూఁడవ పాశురము ఆకాంక్షించును. అప్పుడాయాకాంక్షను నెరవేర్చుటకై భగవానుఁడు ముందునకు సాగుచుండ — 'పల్లాండు-పల్లాండు' అని యామె కేకలిడును. ఈ 'పల్లాండు' గీతికలకు ఆమె తండ్రియగు విష్ణుచిత్తుఁడే కర్త. ఇట్టి ఉత్సాహోద్రేకస్థితిలో తాను సమర్పింపఁదలచిన విన్నపమును విస్మరించును. తన స్థితిని మఱచును. సర్వమును మఱచి, తన్మయత్వము నందును. తనస్వామి పాదచారియై నడచుచుండుటచే, మృదులములైన అతని పాదపద్మములు కందిపోవునని విలపించును. వెంటనే ఆయన పాదపద్మములకు పల్లాండు గీతికలను పాడును. 'దుఃఖములను, బాధ

లను దూరమొనర్చి, ఆనందామృతము ననుభవింప, నఖులతో నీ సన్నిధికేతెంచితి. నని ఇరువదియైదవ పాశురమున భగవానునకు నివేదించును. వ్రతాచరణమునకు వలయు సర్వసాధన సంపత్తిని విశదీకరింపు' మని ఇరువదియారవ పాశురమున భగవానుని ప్రార్థించును. 'భగవానుఁడు మాతో కలసిమెలసియున్నచో, ఆధిభౌతిక-ఆధ్యాత్మిక సంపదలన్ని మావే యగు' నని ఇరువదియేడవ పాశురమున తన భావమును వ్యక్తముచేయును. 'నేను దీనురాలను; అల్పురాలను. కాఁబట్టి, అనంతుఁడవగు నీకీర్తిని, మహిమను వర్ణించుటకై ప్రేమవలనగాని, అజ్ఞానము వలనగాని మధురములు, మానవీయములు నైన పదజాలములను ప్రయోగింపఁజాలనందులకు మన్నింపు' మని ఇరువదియెనిమిదవ పాశురమున పరమాత్మను క్షమాభిక్షనర్థించును. ఇరువది తొమ్మిదవ పాశురము కీలకమైన పాశురము. ఇందామె పరమాత్మనే సర్వదా సేవించుసట్లు వరమొనంగుమనియు, తన కాంక్షలను, కామమును, తృష్ణను, భగవంతునిపైగల ఆకాంక్షలుగ, ప్రేమముగ, నిశ్చలభక్తిగ మార్చి వానిని మధురరసమయములుగా గావింపుమని ప్రార్థించును. ఈ పాశురములను కంఠస్థమొనరించి, నిరంతరము అనునంధించువారు నరసిజాక్షుఁడును, ప్రేమమూర్తియునగు శ్రీకృష్ణ భగవానుని యనుగ్రహమునకు పాత్రులై, సకల శుభములను, సుఖశాంతులను, నిత్యానందమును పొందగలరని ముప్పదవ పాశురమున ఫలశ్రుతి బల్కును.

'తిరుప్పావై' ప్రబంధమున, మహా భక్తురాలగు అండాళ్ హృదయోద్వేగమును నరళగతిని, ఉన్నతపథమున మనము గాంచగలము,·కాత్యాయనీ వ్రతసంబంధ మగు మధురగాథ యందలి సారాంశ

మిదియే. దీనినే ఆండాళ్ కీర్తించి, విశ్వమునకు పరప్రసాదముగ ప్రసా
దించెను. వేదమంత్రములందలి పరమ రహస్యములను సులలిత శైలితో
భావమధురముగా, సామాన్యులకు సైతము హృదయంగమముగా నుండు
నట్లు ఈ ప్రబంధమును గానమొనరించి, వారి జీవితములు పావనమగుటకై
యోగ్యమగు తిరుమంత్రమును ప్రసాదించెను. విశ్వ ప్రేమమునకు
దివ్యమూర్తిగ దీపించిన ఆండాళు సర్వ ప్రపంచమునకు సమర్పించిన
మధురఫలమిదియే. ఇది 'స్వాపదేశార్థము' అని ప్రస్తుతింపఁబడినది.



T.T.D. Religious Publications Series No. : 3
Price : Rs.

Rs 12=00



Printed and Published by Sri K.V.Ramanachary, I.A.S., Executive Officer, T.T.Devasthanams, Tirupati and printed at T.T.D. Press, Tirupati.